సాక్షి నల్లగొండ

సోమవారం । 28 । జూలై । 2025



ఇద్దరు దొంగలు అరెస్ట్
వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను భువనగిరి పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.
- 8లో



ఖమ్మంలో దొరికిపోతామని..
సూర్యాపేటలో సంచలనం సృష్టించిన బంగారం దోపిడీ కేసులో ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు


ప్రస్తుత నీటి మట్టం	:	**583.00** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**93,115** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**35,749** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**29,151** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**511** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**4,287** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,800** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్ డే రద్దు

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ నెల 28న సోమవారం జరగాల్సిన పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇతర కార్యక్రమాల వల్ల గ్రీవెన్స్‌డేను రద్దు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులీ విషయాన్ని గమనించాలని సూచించారు.

కొనసాగుతున్న మూసీ నీటి విడుదల



మూసీ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు ఆదివారం ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లు పైకెత్తి ఉంచి దిగువకు నీటిని వదులుతున్నారు. ఒక్కో గేటును అడుగు మేర పైకెత్తి ఉంచి 1,286 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీకి 1,287 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టులో నీటి మట్టాన్ని 643.30 అడుగుల వద్ద నిలకడగా ఉంచుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 525 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు గేట్ల ద్వారా, ప్రధాన కాల్వలకు, సీపేజీ, లీకేజీల ద్వారా మొత్తం 1,885 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గోవా మహాసభను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: గోవాలోని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో ఆగస్టు 7వ తేదీన జరుగనున్న జాతీయ ఓబీసీ మహాసభలకు బీసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం బీసీ భవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, కోశాధికారి నల్ల సోమమల్లయ్య, గౌరవాధ్యక్షుడు కంది సూర్యనారాయణ, కార్యదర్శులు ఇంద్రయ్య, గంజి భిక్షమయ్య, ఆదినారాయణ, వాడపల్లి సాయిబాబా, నల్లం మధుయాదవ్, కందుల వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతం



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

నల్లగొండ : గ్రామ పాలనాధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఆదివారం నల్లగొండలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి, నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో నిర్వహించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు 300 మంది హాజరుకాగా, 78 మంది గైరాజరయ్యారని, గ్రామపాలన అధికారుల పరీక్షకు 110 మంది హాజరుకాగా, 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నిత్యకల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 4వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కాల్వ కట్టలు బలహీనం.. రైతుల్లో భయం.. భయం!

- ఉమ్మడి జిల్లా పరిధిలో పలుచోట్ల దెబ్బతిన్న ఎడమకాల్వ లైనింగ్
- మరమ్మతు పనుల్లోనూ కొరవడిన నాణ్యత
- గడిచిన మూడేళ్లలో రెండు చోట్ల గండ్లు పడి తీవ్రంగా నష్టపోయిన కర్షకులు
- ఇప్పుడూ అదే పరిస్థితి ఉండడంతో ఆందోళన చెందుతున్న రైతులు

◆ 2022లో నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నిడమనూరు మండలంలోని 32వ కిలోమీటరు వద్ద గండిపడింది. వందల ఎకరాలు నీటి మునిగాయి. గండి పూడ్చేందుకు 40 రోజుల పాటు నీటి నిలిపివేశారు. ఆ సమయంలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు.

◆ 2024 సెప్టెంబరు 1వ తేదీన నడిగూడెం మండలంలో 132 కిలోమీటరు వద్ద కాలువ కాల్వ కట్ట బలహీనంగా ఉండటంతో భారీ గండ్లు పడ్డాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది.



వేములపలి : ఎల్-11, 12 సమీపంలో లైనింగ్ ధ్వంసమై కుంగుతున్న ఎడమకాల్వ కట్ట

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్టలు బలహీనంగా మారాయి. పలుచోట్ల లైనింగ్ లేకపోవడం, లైనింగ్ ఉన్నచోట ధ్వంసం కావడం, కాంట్రాక్టర్ అక్కడక్కడా చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయి. సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 582.90 అడుగులకు (291.3795 టీఎంసీలు) చేరుకుంది. ఈ వరద ప్రవాహం వారం రోజుల పాటు కొనసాగితే నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నిండనుంది. రెండుమూడు రోజుల్లో క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాల్వలకు కూడా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయనున్నారు. ఈ తరుణంలో సాగర్ ఎడమ కాలువ కట్ట పలుచోట్ల బలహీనంగా ఉండడంతో ఎక్కడ గండి పడుతుందోనన్న భయం రైతులను వెంటాడుతోంది. అదే జరిగితే నష్టం ఊహించని విధంగా సంభవించే అవకాశం ఉంది. పెద్ద ఎత్తున పంట నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆధునీకరణ అంతంతే..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆధునీకరణలో భాగంగా సీసీ లైనింగ్ కోసం 2004లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. వాటిని పరిశీలించిన ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో 2009లో ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.4444 కోట్లను మంజూరు చేసింది. దీంతో 2010లో సాగర్ ఎడమ కాలువతోపాటు మేజర్లు, మైనర్ల ఆధునీకరణ పనులను ప్రభుత్వం ప్రారంభించింది. సాగర్ ఎడమకాలువ ప్రారంభం నుంచి ఖమ్మం టేకులపల్లి వరకు, ప్రకాశం జిల్లా లింగంగుట్ల సర్కిల్ పరిధి వరకు, నూజివీడు సర్కిల్ పరిధి వరకు పనులను చేపట్టింది. అయితే నిధులు సరిపోకపోవడంతో పలుచోట్ల ప్రధాన కాలువతోపాటు మేజర్ల లైనింగ్ మధ్యలోనే ఆగిపోయింది. చాలా చోట్ల పనులు పూర్తి కాలేదు.

నాణ్యత లోపం వల్లే కాల్వకు గండ్లు

ప్రధాన కాల్వ ఆధునీకరణలో అక్కడక్కడా చేపట్టిన పనుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న విమర్శలు ఉన్నాయి. పనుల్లో నాణ్యత లోపం కారణంగానే ప్రధాన కాల్వలకు గండ్లు పడుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. జిల్లాలో 2002, 2024లో కాల్వకు గండ్లు పడ్డాయి. ఆ తరువాత ప్రభుత్వం వాటి మరమ్మతులకు నిధులను కేటాయించింది. అయితే పడిన గండిని పూడ్చారే తప్ప మిగతా మరమ్మతు పనులను పూర్తి చేయలేకపోయారు. దీంతో నీటి విడుదల కొనసాగుతుండడంతో కట్టలు మరింత బలహీనంగా మారే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.



వేములపల్లి మండలంలోని అన్నపరెడ్డిగూడెం ఎత్తిపోతల తూము వద్ద కుంగిన కట్ట

నిడమనూరు వద్ద కొట్టుకుపోయిన లైనింగ్

2022లో నిడమనూరు మండలంలోని 32వ కిలోమీటరు వద్ద గండిపడి 40 రోజులపాటు నీటి నిలిపివేయాల్సి వచ్చింది. ప్రస్తుతం 32.4 కిలోమీటరు వద్ద వేంపాడు బ్రిడ్జి సమీపంలో వంద మీటర్ల పరిధిలో సీసీ లైనింగ్ వేయలేదు. దీంతో ప్రధాన కాల్వ నీటి ప్రవాహ ఒత్తిడికి గురై కాల్వ కట్ట బలహీనంగా మారుతోంది. అలాగే అక్కడి యూటీ (కాల్వ కిందిగా వర్షం నీరు ప్రవహించేవి), ముప్పారం యూటీ, నిడమనూరు యూటీల్లో పలుచోట్ల నీరు లీకేజీ అవుతోంది. 31వ కిలోమీటరు వద్ద ముప్పారం బ్రిడ్జి వెంట కాల్వ సీసీ లైనింగ్ పగిలిపోయి.. ముక్కలుగా మారి కాల్వలో కొట్టుకుపోయింది. దీంతో కాల్వ కట్ట బలహీనంగా మారింది. ముదిమాణిక్యం మేజర్ వద్ద, బొక్కమంతులపాడు(బికెపహాడ్) వద్ద కట్ట ప్రమాదకరంగా మారింది.

మరమ్మతులకు రూ.44.78కోట్లు కేటాయించినా..

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని సాగర్ ఎడమ కాలువ పలుచోట్ల దెబ్బతినడంతో మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ.44.78 కోట్లు కేటాయించింది. నల్లగొండ జిల్లాలో 1.89 కిలోమీటరు నుంచి 73.800 కిలోమీటరు వరకు రూ.15.78కోట్లు, సూర్యాపేట జిల్లాలో 74 కిలోమీటరు నుంచి 133 కిలోమీటరు వరకు రూ.29కోట్లు కేటాయించింది. అయితే కాంట్రాక్టర్ పనులను ఆలస్యంగా ప్రారంభించడంతో ఇప్పటికీ పూర్తి కాలేదు. మరోవైపు చేసిన పనులు కూడా నాసిరకంగా ఉన్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాటికే ఆ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో పూర్తికాలేదు. నల్లగొండ జిల్లా పరిధిలో ఎడమ కాలువపై 30 యూటీలు ఉండగా ఐదు యూటీల వద్దనే మరమ్మతు పనులను చేపట్టారు. మరోవైపు పలు చోట్ల సీసీ లైనింగ్, ఫ్లోరింగ్ కోసం తాజాగా రూ.30కోట్లతో అధికారులు మళ్లీ ప్రతిపాదనలు పంపారు.

కట్ట మరమ్మతులు చేపట్టాలి



మా గ్రామ సమీపాన ఉన్న ఎడమ కాల్వ కట్ట పలు చోట్ల లైనింగ్ దెబ్బతింది. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి కట్టకు మరమ్మతులు చేపట్టాలి.

– సింగిరెడ్డి పుల్లారెడ్డి, రైతు, రామాపురం, నడిగూడెం

నడిగూడెంలో కాల్వ అధ్వానం

నడిగూడెం మండల పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్టలు అధ్వానంగా మారాయి. 123 కిలో మీటరు నుంచి 132 కిలో మీటరు వరకు పలు చోట్ల లైనింగ్ దెబ్బతింది. కట్టలు కూడా బలహీనంగా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబరు 1వ తేదీన కురిసిన భారీ వర్షాలకు 132 కిలోమీటరు వద్ద కాల్వ కట్ట బలహీనంగా ఉండటంతో భారీ గండ్లు పడ్డాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇంకా పలు చోట్ల కట్టలపై కంపచెట్లు పెరిగాయి. దీంతో రైతుల రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే కాల్వ కట్టలకు పూర్తి స్థాయి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.



నిడమనూరు : ముప్పారం బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న లైనింగ్



నడిగూడెం మండలం కృష్ణానగర్ వద్ద కంపచెట్లతో అడవిని తలపిస్తున్న ఎడమకాల్వ కట్ట



రామాపురం వద్ద దెబ్బతిన్న లైనింగ్

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

చందంపేట : రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామంలో చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో నూతన రేషన్‌కార్డులు మంజూరైన లబ్ధిదారులకు ఆయన.. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జిల్లాతోపాటు దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి తన శాఖా నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ రూ.1800 కోట్లతో ఎదుళ్ల నుంచి డిండి ప్రాజెక్టు నీటిని మళ్లించి ఈ ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లోని అంబాభవాని, కంబాలపల్లి, పొగిళ్ల లిఫ్టు పనులను వేగవంతంగా పూర్తి చేసి సాగునీరు అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఎస్ఎల్‌బీసీ పూర్తిచేసి ఈ ప్రాంతంలోని 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అర్హులైన వారు రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు దశలవారీగా కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి ఊపందుకుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశం, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి చత్రు నాయక్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డి.శైలజ, మార్కెట్ చైర్మన్ జమున, తహసీల్దార్లు శ్రీధర్ బాబు, ఉమాదేవి, ఎంపీడీఓ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీశైలంయాదవ్, వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య, బద్యానాయక్, సర్వయ్య, గోవిందుయాదవ్, కిన్నెర హరికృష్ణ, బస్వారెడ్డి, గడ్డం వెంకటయ్య, మల్లారెడ్డి, అనంతగిరి తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డు మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

● **రేణుకా ఎల్లమ్మకు 'తొలి' బోనాలు**



శ్రావణమాస తొలి ఆదివారం సందర్భంగా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మకు బోనాలను సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు

హాస్టళ్ల అద్దె బకాయి!

- ఎస్సీ కళాశాల వసతి గృహాలకు కిరాయి చెల్లించని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న యజమానులు, విద్యార్థులు



నల్లగొండ : కళాశాల హాస్టల్ భవనాలకు అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. ఏళ్ల తరబడి ప్రభుత్వం హాస్టల్ భవనాలకు అద్దెను చెల్లించకపోవడం వల్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనంలో చిన్న మరమ్మతు వచ్చిన యజమానులు చేయించడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు తప్పడం లేదు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 10 కళాశాల హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. వీటిలో నల్లగొండలో 5, దేవరకొండలో 2, మిర్యాలగూడలో 2, నకిరేకల్‌లో 1 హాస్టల్ ఉంది. వీటిలో 4 హాస్టళ్లు బాలికలకు, 6 హాస్టళ్లు బాలురవి ఉన్నాయి. ఈ హాస్టళ్లన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెలా రూ.4,28,783 అద్దె చెల్లిస్తున్నారు. దాదాపు ఏడాదిన్నకు పైగా అద్దె చెల్లించపోవడంతో రూ.74,68,821 బకాయిలు పేరుకుపోయాయి.

యజమానులు అప్పులపాలు

ప్రభుత్వం ప్రతి నెలా అద్దె ఇస్తుందని యజమానులు హాస్టళ్లకు భవనాలు ఇచ్చారు. కానీ ఏడాదిన్నర నుంచి అద్దె రాకపోవడంతో ఓనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు భవనాల అద్దె మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కొందరు ప్రతినెలా బ్యాంకులకు భవనాల ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం అద్దెలు చెల్లించపోవడంతో వారు అప్పుల పాలవుతున్నారు. మరోవైపు భవనంలో చిన్నపాటి మరమ్మతు వచ్చినా అద్దె రాలేదనే కారణంతో యజమానులు బాగు చేయించడం లేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై ఎస్సీ డీడీ బి.శశికళను వివరణ కోరగా.. అద్దెకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే అద్దె బకాయిలు రాగానే చెల్లిస్తామని పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

నల్లగొండ : కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐఏఎస్ అధికారి భవేశ్‌మిశ్రా ఆకాంక్షించారు. వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది నల్లగొండ్ర కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సేంద్రియ పద్ధతిలో చేస్తున్న సాగుకు సంబంధించి మార్కెటింగ్‌పై రూపొందించిన లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కేంద్రీయ విద్యాలయ విద్యార్థులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐఏఎస్ అధికారి భవేశ్‌మిశ్రా

చేనేత కార్మికులకు అండగా ఉంటా

చండూరు : చేనేత కార్మికులకు, పద్మశాలీలకు అండగా ఉంటానని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ అన్నారు. ఆదివారం చండూరులో జరిగిన చేనేత పరిరక్షణ సమితి ద్వితీయ వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తన స్వగ్రామానికి రావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. చేనేత సమస్యలపై తనకు వినతి రూపంలో ఇవ్వాలని చేనేత సంఘం పెద్దలకు సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం భిక్షమయ్య, గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, ప్రధానకార్యదర్శి గంజి శ్రీనివాస్, దేవా, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో కోలాహలం

యాదగిరిగుట్ట: పంచనారసింహుడు కొలువైన యాదగిరి క్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు, భక్తుల రద్దీతో కోలాహలం నెలకొంది. వేకువ జామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా శ్రీసుదర్శన నారసింహ హోమం, ఆ తరువాత గజవాహన సేవ, ఉత్సవ మూర్తుల నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాత్రికి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మాడుగులపల్లి: రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాడుగులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పందిరి జానయ్య(40) కొంతకాలంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. గత నాలుగు సంవత్సరాల క్రితం జానయ్యతో అతడి భార్య విడాకులు తీసుకుంది. ఈక్రమంలో భార్య లేకపోవడంతో మానసికంగా కుంగిపోయి మతిస్థిమితం కోల్పోయాడు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో మాడుగులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనంతగిరి: అనంతగిరి మండలంలోని తమ్మ బండపాలెం గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో అదే గ్రామానికి చెందిన వ్యక్తి గంజాయి సేవిస్తుండగా ఆదివారం అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. తమ్మరబండపాలెం గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న వెంచర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై నవీన్ కుమార్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. షేక్ వేనాజ్ పాషా గంజాయి సేవిస్తుండగా పట్టుకున్నారు. అతడి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కోదాడ పట్టణంలో తన తండ్రి నిర్వహిస్తున్న వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం, పూరి సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నాడు. తాను గంజాయి సేవించడంతోపాటు ఇతరులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు వేనాజ్ పాషాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గత సంవత్సరంలోనూ నిందుతుడిపై కోదాడ పట్టణపోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

మఠ్రిగూడ: మఠ్రిగూడలో గుణగంటి వెంకటయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో రెండు గడ్డివాములు శనివారం రాత్రి దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని వాపోయాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

నీరు పారదు.. పంట తడవదు

- చిట్టడవులను తలపిస్తున్న సాగునీటి కాలువలు
- చివరి ఆయకట్టుకు చేరని నీరు
- పట్టింపులేని యంత్రాంగం
- ఆయకట్టు రైతులకు తప్పనితిప్పలు

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న సాగునీటి కాలువలు కంప చెట్లు, గుర్రపు డెక్క, చెత్త చెదారంతో నిండిపోతున్నాయి. కృష్ణా ఎగువ భాగంలో వర్షాలు పడుతుండటంతో శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు రోజుకు 1.20 లక్షల క్యూసెక్కుల చొప్పున నీరు వస్తోంది. ఈనెల 28న నాగార్జునసాగర్ గేట్లు తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాగర్ కాలువలతోపాటు ఏఎంఆర్‌పీ ప్రధాన కాలువలు అక్కడక్కడ దెబ్బతినగా, డిస్ట్రిబ్యూటరీల పరిస్థితి అధ్వానంగా మారడంతో చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ



వేములపల్లిలో కంప చెట్లతో మూసుకుపోయిన ఎల్‌-18 కాలువ

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ ఎడమకాల్వ పరిధిలో మొత్తం 54 మేజర్లు ఉండగా నల్లగొండ జిల్లాలో 30, సూర్యాపేట జిల్లాలో 24 మేజర్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో మేజర్ల కింద 98,030 ఎకరాలు, 31 ఎత్తిపోతల పథకాల కింద 47,690 ఎకరాల సాగు భూమి ఉంది. సూర్యాపేట జిల్లాలో మేజర్లు ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 2.35లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నల్లగొండ జిల్లాలో రాజవరం, సూరేపల్లి, నార్కెట్ల గూడ, ముదిమాణిక్యం, వజీరాబాద్, కిష్టాపురం, ముల్కలకాల్వ మేజర్లతోపాటు సూర్యాపేట జిల్లాలోని మేజర్లు, మైనర్ కాలువలు దెబ్బతినడంతో సామర్థ్యం మేరకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. భారీ వర్షాల కంటే ముందుగానే కాలువల మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని చోట్ల పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొంది.

వేములపల్లిలో అధ్వానంగా కాలువలు

వేములపల్లి మండల పరిధిలోని ఎల్‌-18, 19 పరిధిలోని కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువలలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో కాలువ చివరి భూముల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలో పెరిగిన చెట్లను చూస్తుంటే చిట్టడవిని తలపించేలా తయారయ్యాయి. వీటి కింద 3863 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, కాలువలు దెబ్బతినడంతో దాదాపు 800 ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది.


చిలుకూరు మండలం ఆర్లెగూడెం వద్ద అస్తవ్యస్తంగా ఉన్న ఆర్‌కే మేజర్ పరిధిలోని 5-ఆర్ మైనర్ కాలువ

అస్తవ్యస్తంగా మైనర్ కాల్వలు

చిలుకూరు మండలంలోని ముక్త్యాల బ్రాంచి కెనాల్‌కు అనుబంధంగా ఉన్న రెడ్లకుంట మేజరు పరిధిలోని మైనరు కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆర్లెగూడెం, రామచంద్రానగర్, కొండాపురం, రామాపురం, చిలుకూరు, సీతారామాపురం గ్రామాల పరిధిలోని 5 -ఆర్ నుంచి 10- ఆర్ వరకు ఉన్న మైనర్ కాలువలు, ఎల్‌-2, ఎల్‌-3 మైనర్ కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి.

మేజర్, మైనర్ కాలువల్లో కంపచెట్లు

హుజూర్‌నగర్ పరిధిలోని లింగగిరి మేజర్, బూరుగడ్డ మైనర్ కాలువలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు బాగా పెరిగాయి. అక్కడక్కడ రాళ్లు కూడా ఉన్నాయి. కొన్ని చోట్ల కాలువ కట్టను కొందరు ధ్వంసం చేశారు. మఠంపల్లి మండలం మట్టపల్లి మేజర్ ఎడమ కాలువకు అనుసంధానమైన ముత్యాల మేజర్ నుంచి సాగునీరు వేసంగి వానాకాలం సీజన్లకు విడుదల చేస్తారు. అయితే మండలంలోని బక్కమంతుల గూడెం నుంచి లాలితండా వరకు సుమారు పది కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ మేజర్ కాలువలో కంప చెట్లు దట్టంగా పెరిగి సాగునీరు చివరి వరకు చేరని దుస్థితి ఏర్పడింది. నేరేడుచర్ల మండలంలోని జాన్‌పహాడ్, చిల్లేపల్లి మేజర్ కాలువ పరిధిలోని మైనర్ కాలువల్లో కంప చెట్లు, చెత్తా చెదారం పేరుకుపోయింది.


నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెంలో గల ఎల్‌-1 కాలువ

తిప్పర్తి మండలంలోని డిస్ట్రిబ్యూటరీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాటినిండా కంపచెట్లు పెరిగిపోయాయి. ఇండ్లూరు సమీపంలో డిస్ట్రిబ్యూటరీ 40, సబ్ మైనర్ ఎల్ 11 కాలువలో మధ్యలోనే తాటి చెట్లు, కంప చెట్లు మొలిచి పూర్తిగా కాలువ మూసుకుపోయింది.

మైనర్ కాలువలకు మరమ్మతులేవి?

గుర్రంపోడు మండలంలో మేజర్ కాలువలలో కంపచెట్లను ఇటీవల తొలగించారు. అయితే మైనర్ కాలువల్లో మాత్రం అలాగే ఉండిపోయాయి. గుర్రంపోడు మండల పరిధిలో 55 కిలోమీటర్ల మేరకు మేజర్ కాల్వ కంపచెట్లు, చెదారంతో పూడుకుపోయింది. ప్రధానంగా నల్లరేగడి భూములు మేజర్ కాలువలు కోతకు గురై ఆనవాళ్లు లేకుండా ఉన్నాయి. దీంతో చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది.


తిప్పర్తి మండలం ఇండ్లూరు సమీపంలో కాలువలో ఉన్న తాటి చెట్లు

చెత్త, చెదారం తొలగించాలి


ఆర్‌-3 కాలువలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించాలి. ఆర్‌-3 కాలువ పట్టణం మీదుగా వెళ్తుండటంతో కాలువ వెంట ఉన్న ఇళ్ల వారు, దుకాణాదారులు కాలువలో పోసిన చెత్త, చెదారం నీటి ప్రవాహానికి అడ్డంగా మారి చివరి భూములకు నీరందడం లేదు.

– కసిరెడ్డి మాధవరెడ్డి, నర్సయ్యగూడెం, నేరేడుచర్ల మండలం

కంపచెట్లతో మూసుకుపోయింది


డీ 22 మేజర్ కాలువ ప్రారంభంలో, మైనర్ కాలువ అంతా కంపచెట్లతో మూసుకుపోయింది. దీంతో చివరి ఆయకట్టు నీరందని పరిస్థితి నెలకొంది. ప్రతి ఏటా పంటలు ఎండిపోతున్నాయి. కంపచెట్లు తొలగించడంతో పాటు కాలువను లోతుగా తవ్వి పూడిక తీయాలి.

– మారెడ్డి మహేందర్‌రెడ్డి, పిట్టలగూడెం, గుర్రంపోడు మండలం

అధికారులు స్పందించి బాగు చేయాలి


అధికారులు స్పందించి నాలుగైదు గ్రామాల రైతులకు సాగునీరు అందించే మేజర్, మైనర్ కాలువల్లో ఉన్న రాళ్లు కంప చెట్లను వెంటనే తొలగించాలి. రైతులకు సక్రమంగా సాగు నీరు అందే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– వట్టికూటి వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్

కాలువలకు మరమ్మతులు చేయాలి


మా పొలాల సమీపంలోని కాలువ మధ్యలో తాటిచెట్లు, కంపచెట్లు పెరిగాయి, వేసవిలో ఉపాధి హామీ కింద చిన్నచిన్న చెట్లు తొలగించారు. కానీ తాటి చెట్లు, ఇతర పెద్ద చెట్లు కాలువ మధ్యలోనే వదిలేశారు. వాటిని తొలగించి కాలువకు మరమ్మతులు చేయాలి.

– పోలేబోయిన శంకర్, ఇండ్లూరు, తిప్పర్తి మడలం

ఇద్దరు దొంగలు అరెస్ట్

భువనగిరిటౌన్ : వరస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని భువనగిరి పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన బద్దుల అనిల్, స్వాతి భార్యాభర్తలు. సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు అలవాటు పడ్డారు. ఇప్పటికే వీరిపై ఐదు పోలీస్ స్టేషన్‌లలో పలు చోరీ కేసులు ఉన్నాయి. ఓ కేసులో అరెస్ట్ అయి 11 నెలల అనంతరం ఇటీవల జైలు నుంచి విడుదలయ్యారు. ఈ నెల 18న భువనగిరి పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో, 24న అదే కాలనీలో మూడు ఇళ్లలో చోరీ చేసి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భువనగిరి పట్టణంలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. చోరీలకు పాల్పడుతుంది వీరేనని తేలింది. ఇప్పటి వరకు దొంగతనం చేసిన నగదు, బంగారు ఆభరణాలు రికవరీ కాలేదని పోలీసులు తెలిపారు. సమగ్ర విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

ఏడాది క్రితం అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

- భార్యతో విభేదాలతో ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త
- భూటాన్‌లో ఉన్నట్లు గుర్తించి ఇండియాకు రప్పించిన పోలీసులు

గరిడేపల్లి: ఏడాది క్రితం అదృశ్యమైన వ్యక్తి ఆచూకీని పోలీసులు తెలుసుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గరిడేపల్లి మండలంలోని కుత్బుషాపురం గ్రామానికి చెందిన షేక్ జాన్‌సైదులు కోదాడలో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఏడాది క్రితం భార్యతో విభేదాలు రావడంతో కుత్బుషాపురం గ్రామంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మరోసారి భార్య, అత్తమామలతో గొడవ పడ్డాడు. వారికి చెప్పకుండా లారీలో లోడ్ దించేందుకు భూటాన్ దేశానికి వెళ్లాడు. లారీని మరో డ్రైవర్‌తో ఇండియాకు పంపించాడు. అతను అక్కడే మొక్కజొన్న ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జాన్‌సైదులు కనిపించకపోవడంతో అతడి భార్య ఆస్మా ఫిబ్రవరిలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని ఎస్‌ఐ చలికంటి నరేష్ సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. సదరు జాన్‌సైదులు నెలకు ఒక సిమ్ మారుస్తుండటం, భూటాన్ దేశంలో సెల్ పనిచేయకపోవడంతో ఆచూకీ కనుగొనడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఎస్‌ఐ చాకచక్యంగా జాన్‌సైదులును ఇండియాకు రప్పించారు. 20 రోజుల క్రితం జాన్‌సైదులు హైదరాబాద్‌కు చేరిన విషయం గుర్తించిన ఎస్‌ఐ అతని కదలికపై ప్రత్యేక నిఘా పెట్టారు. తమ సిబ్బందితో గాలించి ఎట్టకేలకు అతడిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


షేక్ జాన్‌సైదులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై చలికంటి నరేష్

వైభవంగా హరిహర పంచాలు

భువనగిరి: స్వర్ణగిరి క్షేత్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా హరిహర పంచాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు హృషికేష్, శివేష్‌లు తన జీవితంలో కొత్త దశను ప్రారంభించడాన్ని పురస్కరించుకుని ధార్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి రాజేశంగౌడ్, మాజీ న్యాయమూర్తి బలరాం హాజరయ్యారు. అంతకు ముందు వారుఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆండాళ్ అమ్మవారికి సేవోత్సవం

యాదగిరిగుట్ట: తిరు నక్షత్ర వేడుకల్లో భాగంగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి శనివారం ఉదయం స్నపనం నిర్వహించారు. రాత్రి వేళ అమ్మవారి సేవను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో ఆలయ అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. సోమవారం రాత్రి అమ్మవారికి తిరునక్షత్ర వేడుకలు చేపట్టి, ఇష్టమైన నైవేద్యం సమర్పించారు.


ఆలయ మాడ వీధిలో అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

ఖమ్మంలో దొరికిపోతామని..

- సూర్యాపేటను ఎంచుకున్న దుండగులు
- బంగారం దోపిడీ కేసులో మహిళ అరెస్టు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో సంచలనం సృష్టించిన సాయి సంతోషి జ్యువెలరీ షాపులో ఈ నెల 21న రాత్రి జరిగిన బంగారం దోపిడీ కేసులో ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో కొత్త విషయాలు వెలుగుచూసాయి. ప్రధాన నిందితుడు గతంలో ఖమ్మంలో చోరీ చేసి పట్టుబడ్డాడు. ఈనేపథ్యంలో ఖమ్మంలో చోరీ చేస్తే దొరికిపోతామని గ్రహించి సూర్యాపేటలో దొంగతనానికి ఒడిగట్టేందుకు స్కెచ్ వేశాడు. చోరీ కేసుని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ నరసింహ 5 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసింది నేపాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ముఠాగా గుర్తించారు. ప్రత్యక్షంగా ఐదుగురు నిందితులు దొంగతనంలో పాల్గొనగా వారికి సహకరించింది మరో ఇద్దరుగా గుర్తించారు. దొంగతనంలో సహకరించిన యశోద అనే మహిళను అరెస్ట్ చేసి విచారణ చేశారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ వివరాలు వెల్లడించారు. ఆదివారం సూర్యాపేట హై టెక్ బస్టాండ్ సమీపంలో పోలీసులు ఫింగర్ ప్రింట్స్ తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఖమ్మం పట్టణంలోని నాయుడుపేటకు చెందిన మేకల యశోద బ్యాగును పరిశీలించగా శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో చోరీకి గురైన కొన్ని ఆభరణాలు లభ్యమయ్యాయి. ఖమ్మం పట్టణంలో నేపాల్‌కు చెందిన ఏ6 నిందితుడైన అమర్‌బట్ గూర్ఖాగా పనిచేస్తుండేవాడు. ఏడాది క్రితం ఈ కేసులో ఏ1 నిందితుడైన నేపాల్‌కు చెందిన ప్రకాష్ అనిల్‌కుమార్.. ఖమ్మంలో ఉంటున్న అమర్ బట్ వద్దకు వచ్చి గూర్ఖాగా పనిచేస్తూ యశోద అనే మహిళతో సంబంధం ఏర్పరుచుకున్నాడు. ప్రకాష్ అనిల్‌కుమార్, అమర్‌బట్ వీరిద్దరు కలిసి ఖమ్మంలో వివిధ కాలనీల్లో రెక్కీ నిర్వహిస్తూ దొంగతనాలకు పాల్పడుతుండేవారు. వీరికి యశోద ఆశ్రయం కల్పిస్తూ దొంగతనాలు చేయడానికి సాయం చేస్తుండేది. గతంలో ఖమ్మంలో దొంగతనాలు చేసి దొరికిపోయారు. అయితే ఈసారి ఖమ్మంలో చోరీ చేస్తే దొరికిపోతామని, సూర్యాపేట పట్టణాన్ని ఎంచుకున్నారు. ప్రకాష్ అనిల్‌కుమార్‌కు తెలిసిన మరొక వ్యక్తి అయిన నేపాల్‌కుచెందిన కడాక్ సింగ్‌తోపాటు, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ముగ్గురిని పిలిపించుకుని చోరీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రకాష్ అనిల్‌కుమార్, అమర్‌బట్‌లకు ఆశ్రయం ఇస్తూ, ఆర్థికంగా, దొంగతనాలకు సహకరిస్తున్న మేకల యశోదతో కలిసి సూర్యాపేటకు వచ్చారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

నేపాల్‌లో అమ్మేందుకు..

సూర్యాపేటలో దొంగలించిన బంగారం ఇక్కడ అమ్మితే అనుమానం వస్తుందని నేపాల్‌కు తీసుకెళ్లి అమ్ముదామని ఐదుగురు నిందితులు నిర్ణయించారు. ఈమేరకు వారికి ఆశ్రయం ఇచ్చి సహకరించిన అమర్ బట్, మేకల యశోద ఖర్చులకు కొన్ని బంగారు ఆభరణాలు ఇచ్చి నేపాల్‌కు పోతున్నట్లు వారికి చెప్పారు. నిందితురాలు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యక్షంగా చోరీకి పాల్పడిన నేపాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మొత్తం ఐదుగురిని గుర్తించామని ఎస్పీ తెలిపారు.

సూర్యాపేటలో ఇంటిని అద్దెకు తీసుకొని..

సూర్యాపేటలో దొంగతనం చేయాలని పథకం ప్రకారం ఈ ఏడాది మే మొదటి వారంలో మొదట ప్రకాష్ అనిల్‌కుమార్, అమర్‌బట్, మేకల యశోదలు కలిసి సూర్యాపేట ఎంజీ రోడ్డులోని బంగారం షాపు వెనుక ప్రాంతంలో యజమాని లేని ఇంట్లో ఒక రూంను అద్దెకు తీసుకున్నారు. మే చివరి వారంలో సూర్యాపేటకు వచ్చి రెక్కీ నిర్వహించి మళ్లీ ఖమ్మం వెళ్లారు. ప్రకాశ్ అనిల్‌కుమార్, జార్ఖండ్‌కు చెందిన కడక్ సింగ్‌తో పాటు మరో ముగ్గురు (జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన) వ్యక్తులతో కలిసి అదును చూసి శ్రీ సాయి సంతోషి జ్యువెలరీలో షాపులో దొంగతనానికి పాల్పడ్డారు.

రెండున్నర కిలోల బంగారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు

ఈ కేసులో మొత్తం జ్యువెలరీ షాపు యజమాని రెండున్నర కిలోల బంగారం, కొంత నగదు దొంగతనానికి గురైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో ఆరుగురు నిందితుల కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు చెప్పారు. త్వరలో నిందితులను పట్టుకుని బంగారం రికవరీ చేస్తామని పేర్కొన్నారు. ఏ1 నిందితుడైన ప్రకాష్ అనిల్‌కుమార్‌పై గతంలో ఖమ్మం జిల్లాలో మూడు దొంగతనం కేసులో ఉన్నాయని, మిగిలిన నిందితులపై ఉన్న పాత కేసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మహిళా నిందితురాలి నుంచి 14తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ శివతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి యువకుడి మృతి

మేళ్లచెరువు : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కృష్ణానదిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చింతలపాలెం మండలంలోని నక్కగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. నక్కగూడెం గ్రామానికి చెందిన బాణావత్ నాగరాజు (35) స్థానికంగా కృష్ణానదిలో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. గమనించిన తోటి జాలరులు అతడిని బయటకు తీయగా మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా.. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

సూర్యాపేట : తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం ఎక్స్ రోడ్డు వద్ద మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తల్లిదండ్రులైన బూర లక్ష్మయ్య గౌడ్, బూర రాజమ్మల జ్ఞాపకార్థం వారి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తనను చదివించారని, వారి జ్ఞాపకార్థం వారి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ పిల్లలు ఉన్నత స్థితికి ఎదగాలని తల్లిదండ్రులు ఆకాంక్షిస్తారని, వారి కోరిక తీరే విధంగా పిల్లలు కష్టపడి చదివి జీవితంలో ఉన్న స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మాజీ అధికార ప్రతినిధి బూర మల్సూరు గౌడ్, బీజేపీ నాయకులు కడియం రామచంద్రయ్య, మన్మథ రెడ్డి, చల్లమల్ల నరసింహ పాల్గొన్నారు.


బూర లక్ష్మయ్యగౌడ్, రాజమ్మల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి దుర్మరణం

- బంధువు అంత్యక్రియలకు వెళ్లివస్తుండగా ఘటన

శాలిగౌరారం: ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం శాలిగౌరారం మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కట్టంగూరు మండలం కురుమర్తి గ్రామానికి చెందిన గండికోట శ్రీనివాస్(38) తన తల్లి, చెల్లెలుతో కలిసి ద్విచక్ర వాహనంపై శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో మృతిచెందిన తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఈ ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై మండల కేంద్రం మీదుగా శాలిగౌరారం-భైరవునిబండ ప్రధాన రోడ్డుపై కురుమర్తికి వస్తున్నారు. ఈక్రమంలో మండల కేంద్రంలో ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్న ఆకారం గ్రామానికి చెందిన గోదాసు భద్రయ్య ట్రాక్టర్ ఎరువుల లోడుతో ఆకారం వెళ్తుండగా దానిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వీరి బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న శ్రీనివాస్ ట్రాక్టర్ ట్రాలీ చక్రం కింద పడగా.. బైక్ వెనుక కూర్చున్న అతని తల్లి, చెల్లెలు రోడ్డుపక్కకు పడ్డారు. ట్రాక్టర్ ట్రాలీ చక్రం శ్రీనివాస్ తలపై నుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు లొంగిపోయాడు.


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు

కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన

శ్రీనివాస్ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న అతడి బంధువులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. నిందితుడిని శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని ఇక్కడి నుంచి తరలించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.

